క్లుప్తంగా

పారిశుద్ధ్య పనుల పరిశీలన



మదనాపురం: మండలంలోని కొన్నూరులో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను గురువారం జెడ్పీ సీఈఓ శ్రావణ్‌కుమార్ ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలో ఉపాధి కూలీలు చేస్తున్న పనులు, డ్రెయినేజీల నిర్వహణ, నూతన పనుల నాణ్యత తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిలివిడి పంచాయతీలో జరుగుతున్న పనుల గురించి పంచాయతీ కార్యదర్శితో ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేంద్ర, ఎంపీఓ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి వాసులకు తెలుగు వెలుగు అవార్డులు

వనపర్తి టౌన్: పట్టణానికి చెందిన నలుగురు కవులు, సాహితీవేత్తలకు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన తెలుగు వెలుగు సాహితీ వేదిక ఇటీవల అవార్డులను అందజేసి సన్మానించినట్లు శుక్రవారం అవార్డులు అందుకున్న కవులు తెలిపారు. సాహిత్య రంగంలో విశేష కృషి చేస్తున్నందుకు, రచనల్లోని నైపుణ్యాన్ని గుర్తించి అవార్డులు ప్రదానం చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ మేరకు వీరాచారికి కవి రత్న, చెన్నయచారికి అధ్యాత్మిక సేవారత్న, హిమవంత్ ఆచారికి పౌరోహిత్య కళారత్న, విరాటాచారికి స్థాపత్య కళారత్న అవార్డులతో జ్ఞాపికను, ప్రశంసా పత్రాన్ని అందించినట్లు చెప్పారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి



పాన్‌గల్: మత్స్యకారుల అభివృద్ధి, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా.పగిడాల శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాల్కిచెరువులో మత్స్యకారులతో సమావేశమై వారి సమస్యలపై ఆరా తీశారు. మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం అవుతూ తమ పిల్లలను మంచిగా చదివించాలన్నారు. వృత్తిలో ప్రమాదాలు చోటుచేసుకుంటాయని దీనిని దృష్టిలో ఉంచుకొని బీమా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం నాయకులు తాళ్ల ఆనందం, బాలస్వామి, బుచ్చన్న, గంగన్న, నర్సింహ, కృష్ణయ్య పాల్గొన్నారు.

చిరుధాన్యాల వినియోగంపై అవగాహన



మదనాపురం: మండల కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై మహిళా రైతులకు కేవీకే శాస్త్రవేత్త అనిత ఆధ్వర్యంలో ఇస్తున్న శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఐదు రోజుల పాటు వివిధ చిరుధాన్యాల విశిష్టతను వివరించారు. గ్రామాల్లో మహిళలు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని లాభాలు ఆర్జించవచ్చన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ భవానిపాల్గొన్నారు.

పీజీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా దేవరాజ్

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మార్కోపోలోని యస్ యూనివర్సిటీ గ్రాంట్ కమిషనర్ ఆధ్వర్యంలో మానవ వనరుల కమిషన్ నిర్వహిస్తున్న తెలుగు రిఫ్రెషర్ కోర్సుకు వెళ్లనున్నారు. 15 రోజుల పాటు ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆయన స్థానంలో జూలై 1 నుంచి 15వ తేదీ వరకు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఎంఎస్‌డబ్ల్యూ విభాగానికి చెందిన అధ్యాపకులు దేవరాజ్ బాధ్యతలు నిర్వర్తించాలని పాలమూరు యూనివర్సిటీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

పట్టాలిచ్చేంత వరకు పోరాటం

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో రెండు రోజులుగా ఇళ్ల స్థలాల కోసం పెంట్లవెల్లి గ్రామ ప్రజలు వందలాది మంది పెంట్లవెల్లిలో 22, 27 సర్వే నంబర్‌లోని 14 ఎకరాల భూమిని కబ్జా చేసుకుని శుక్రవారం హద్దులు ఏర్పాటు చేసుకుని ఏకంగా గుడిసెలు వేసుకున్నారు. ప్రజలకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ మద్దతు తెలియజేశారు. ఆయన మద్దతుతో ప్రజలు ఆ భూమిలో చీరలతో గుడిసెలు వేశారు. అందులో భాగంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు ఆ స్థలాన్ని పరిశీలించి ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఎవరైతే కబ్జాలో ఉన్నారో వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు మీకు అండగా ఉంటామని, ఎంత వరకైనా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. పేదలకు ఇంటి జాగ ఇచ్చేవరకు అందరం ఐక్యంగా ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. అధికారులు స్పందించి వెంటనే పేదలకు స్థలాలు కేటాయించాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు హెచ్చరించారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



కేతేపల్లిలో విద్యార్థులకు గ్లాసులు అందజేస్తున్న నోడల్ ఆఫీసర్, దాత వాకిటి రవికుమార్

కొత్తకోట రూరల్: తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక చూపాలని పెద్దమందడి మండల విద్యాధికారి జయశంకర్ అన్నారు. మండలంలోని బలిజపల్లి, జంగమాయపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ఎంఈఓ ప్రత్యేక సమావేశమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై ఆసక్తి, శ్రద్ధ చూపాలంటే టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. ప్రతి రోజు తెల్లవారుజామున నిద్రలేపి గంట పాటు చదివించాలన్నారు. విద్యార్థులు ఎంత కష్టపడితే అంత మంచి ఫలితాలు సాధించవచ్చని, అదేవిధంగా ఉన్నత విద్యకు స్కూల్ స్థాయి విద్య ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు.

పాన్‌గల్: విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన సాగించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని దావాజిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ప్రార్థన సమయంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ, విద్యార్థుల హాజరు రిజిస్టర్లు, విద్యార్థుల సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పాఠశాల నిర్వహణ, విద్యార్థుల సామర్థ్యాలు, పుస్తక పఠనం తదితర అంశాలపై చర్చించి తగు సూచనలు చేశారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బద్రూనాయక్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టీలు గ్లాసుల అందజేత

మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు వాకిటి రవికుమార్ తన తండ్రి వాకిటి కృష్ణయ్య జ్ఞాపకార్థం రూ.12 వేల విలువైన స్టీలు గ్లాసులను శుక్రవారం మండల నోడల్ ఆఫీసర్, హెచ్‌ఎం శంకరయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న రాగిజావాకు ఈ గ్లాసులను వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు.



దావాజిపల్లి ప్రాథమిక పాఠశాలలో..



బలిజపల్లిలో మాట్లాడుతున్న ఎంఈఓ జయశంకర్

నిధుల వినియోగంపై ఆడిట్

మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు 2022–23 సంవత్సరంలో మంజూరైన నిధులు, వినియోగించిన విధానంపై మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శుక్రవారం ఆడిట్ నిర్వహించినట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. మొదటి రోజు పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాల, తెల్లరాళ్లపల్లి ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు ఆడిట్ చేయించుకున్నట్లు ఎంఈఓ తెలిపారు. మిగిలిన పాఠశాలల హెచ్‌ఎంలు ఈనెల 3వ తేదీ వరకు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మద్దిలేటి, లక్ష్మణ్‌యాదవ్, సీఆర్పీ శేఖర్‌నాయక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత



పామిరెడ్డిపల్లిలో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

వనపర్తి: మండలంలోని దత్తాయపల్లికి చెందిన నాగశేషయ్య కోళ్ల షెడ్ గాలిదాటికి కూలిపోయిన విషయం తెలుసుకుని శుక్రవారం పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి రూ. 25 వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లికి చెందిన మృతుడు పానుగంటి మాసయ్య కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, రమేష్‌గౌడ్, రవిచంద్రరావు, బుచ్చిరెడ్డి, యాదగిరిగౌడ్, మన్నెం, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

మండలంలోని చందాపూర్‌లో ఇటీవల మృతి చెందిన రంగారెడ్డి కుటుంబాన్ని శుక్రవారం మాజీ మంత్రి డాక్టర్ జి. చిన్నారెడ్డి పరామర్శించారు. మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ, తాను అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన మన్నెమ్మ (55) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సేనాపతి, పురుషోత్తం రెడ్డి, పుల్లన్న, గొల్ల మొగులయ్య తదితరులు ఉన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



రిటైర్డ్ అయిన ఉద్యోగులను సన్మానిస్తున్న చిన్నారెడ్డి

వనపర్తి టౌన్: అంకిత భావంతో విధి నిర్వహణలో సేవలందిస్తే రిటైర్డ్ అయిన తర్వాత కూడా గుర్తింపు ఉంటుందని పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి అన్నారు. ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఆర్టీసీ ఉద్యోగులు ఏడీసీ బాలస్వామి, డ్రైవర్లు, మెకానిక్‌లు రాములు, కృష్ణారెడ్డి, టీవై రెడ్డి, వెంకటేశ్వర్లు, బుచ్చన్న పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో చేరిన ఉద్యోగులకు రిటైర్డ్ అనివార్యం అని తెలిపారు. రిటైర్డ్ అయిన తర్వాత కూడా సమాజ శ్రేయస్సుకు ఉద్యోగ జీవిత అనుభవాన్ని జోడించి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో డిపో అధికారులు, డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, టీసీసీ అధ్యక్షుడు చీర్ల చందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు, మత్స్యకార జిల్లా చైర్మన్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతో పేదల సంక్షేమం



అమరచింతలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

వనపర్తి టౌన్: ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పేదలు, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని కర్ణాటకకు చెందిన బీజేపీ నాయకుడు శరణం అంగడి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కృష్ణ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని 14వ వార్డులో బీజేపీ నాయకులు కేంద్ర పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో ఎన్నడూ లేని విధంగా మోదీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చిందని, పుట్టిన బిడ్డ నుంచి పండు ముసలి వరకు బీమా, భద్రత, సంక్షేమం, భరోసా లక్ష్యంగా పథకాలను రూపొందించారని వివరించారు. కార్యక్రమంలో రావిమానిమ్, నారాయణ, బండారు కుమారస్వామి, రాము, నందిమల్ల రవి, అనుజ్ఞారెడ్డి, సూగురు రాము, రాయన్న సాగర్, ప్రవీణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందుతున్నాయా లేదా అన్న విషయాలను తెలుసుకునేందుకు కర్ణాటక రాష్ట్రానికి చెందిన బీజేపీ నాయకులు పట్టణంలో స్థానిక బీజేపీ నాయకులతో కలిసి శుక్రవారం పర్యటించారు. కర్ణాటక రాష్ట్ర విస్తారక్ ప్రముఖ్ గురుపాటిల్ హరి ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో కొనసాగుతున్న అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. తొమ్మిదేళ్ల పాలనలో పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టిన ఘనత మోదీకి దక్కిందని కొనియాడారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్, నారాల నారాయణ, అశోక్‌కుమార్, క్యామ భాస్కర్, జగన్నాథం, అనిల్‌కుమార్, క్యామ భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



మదనాపురం: అక్టోబరు 1 నాటికి 18ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ నరేందర్ కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలో బీఎల్‌ఓలు సందర్శించి యువతకు ఓటర్ నమోదు, దాని ఆవశ్యతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ అశోక్‌కుమార్, ఆర్‌ఐ భాస్కర్ రెడ్డి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

నిందితులకు ఆరు నెలల జైలుశిక్ష



బొల్లారంలో సారా విక్రయిస్తున్న మహిళలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మదనాపురం: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఫిబ్రవరి 2023లో జరిగిన బైక్ దొంగతనం కేసులో కొత్తకోట మండల కేంద్రానికి చెందిన గాండ్ల సుదర్శన్‌రెడ్డికి గురువారం ఆత్మకూర్ మున్సిపల్ జడ్జి శిరీష నాలుగు నెలల జైలు శిక్ష విధించారు.

చోరీ కేసులో..

మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ఓ ఇంటిలో ఫిబ్రవరి 2023లో చోరీ చేసి చీరలు, వస్తువులు దోచుకెళ్లారు. చోరీకి పాల్పడిన కర్ణాటక రాష్ట్రం రాయచూరు ప్రాంతానికి చెందిన బోయ అంజికి గురువారం ఆత్మకూర్ జడ్జి శిరీష ఆరు నెలల జైలు శిక్ష రూ. 400 జరిమానా విధించారు.

వీపనగండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించిన కొత్తపేట ఎక్సైజ్ అధికారులు సారా విక్రయిస్తున్న ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేశారు. బొల్లారం, కొర్లకుంటతండాలో దాడులు జరిపిన ఎక్సైజ్ ఎస్ఐ సతీష్‌కుమార్, వెంకటేశ్వర్లు బొల్లారం గ్రామానికి చెందదిన బాలీశ్వరమ్మ, గనమోని పుల్లమ్మలను సారా విక్రయిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చెక్కు పంపిణీ

పెద్దకొత్తపల్లి: ముష్టిపల్లికి చెందిన శంకరయ్యకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.70 వేల చెక్కును బీఆర్‌ఎస్ నాయకులు గణేష్‌రావు అందజేశారు. లింగస్వామి, విష్ణు, మల్లేష్ పాల్గొన్నారు.

ఉద్యమకారులపై బీఆర్‌ఎస్ వివక్షను ఎండగడతాం



మాట్లాడుతున్న లాక్కకుల సతీష్

వనపర్తి టౌన్: దళితులకు సీఎం పదవి ఇస్తామన్నా హామీ నుంచి దళితులకు సర్కార్ అణువణువునా మోసం చేస్తోందని తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, కాంగ్రెస్ నేత లాక్కకుల సతీష్ మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని నందిహిల్స్‌లో శుక్రవారం కాంగ్రెస్ కౌన్సిలర్లు వెంకటేష్, బ్రహ్మం, రాధాకృష్ణతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో, స్వరాష్ట్రంలో తన ఆట, పాటలతో జన చైతన్యం కలిగించిన సాంస్కృతిక ఉద్యమకారుడు సాయిచంద్‌పై ప్రభుత్వ వివక్ష ప్రదర్శించిందన్నారు. సాయిచంద్ అంత్యక్రియను అధికారికంగా జరిపేందుకు చొరవ తీసుకోలేదని, సాయిచంద్ భౌతికకాయాన్ని తెలంగాణ భవన్‌కు ఎందుకు తరలించలేదని ప్రశ్నించారు. గతంలో ఎలాంటి తప్పులేకపోయిన ఆరోపణలను బూచిగా చూపి ఎమ్మెల్యే రాజయ్యను ఉపముఖ్యమంత్రిగా తప్పించారని, కంటోన్మెంట్ ఎమ్మెల్యే చనిపోయిన అధికారిక లాంఛనాలకు నోచుకోలేదని, ప్రభుత్వం దళితులపై వివక్ష కొట్టొచ్చిన్నట్లు కనిపిస్తుందన్నారు. సాయిచంద్ కుటుంబానికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియా, హైదరాబాద్‌లో మూడెకరాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారులంతా ఏకమై వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. 15 రోజుల్లో మేఘారెడ్డి కాంగ్రెస్‌లో చేరాక ప్రభుత్వ వైఫల్యాలను, ఎన్నో అంశాలను వెలుగులోకి తెచ్చి, ప్రజల ముందు ఉంచుతామన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య, ఫజిల్, లతీఫ్, అస్లాం, శివ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి టౌన్: పట్టణ పరిశుభ్రతకు పాటుపడే పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పట్టణం బాగుంటుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. పట్టణంలోని దుర్గంధాన్ని భరిస్తూ చెత్తను తొలగించే కార్మికులు గొప్పవాళ్లని ప్రశంసించారు. శుక్రవారం నూతన మున్సిపల్ కార్యాలయంలో కార్మికులతో మాట్లాడారు. కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చొరువ తీసుకుంటున్నామని, ప్రతీ 15రోజులకు ఒకసారి మెడికల్ క్యాంప్‌లను నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. తడి, పొడి చెత్తను, ప్లాస్టిక్‌ను చెత్త సేకరణ వాహనాలకు ఇవ్వకుండా డ్రెయినేజీలో పడేసే వారిని గుర్తించి జరిమానాలు విధించేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కార్మికుల వేతనాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆరా తీశారు. కార్మికుల, వార్డుల్లోని సమస్యలు గుర్తించి జవాన్లు మున్సిపల్ అధికారులకు అందించాలని, త్వరలోనే కార్మికులతో ముఖాముఖి భేటీ కానున్నట్లు వెల్లడించారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని 26, 29, 33వ వార్డుల్లో తిరుగుతూ పారిశుద్ధ్య పనులను, నూతనంగా నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ భవనాన్ని, టౌన్ హాల్‌ను, లలిత కళాతోరణం భవన నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ విక్రమసింహారెడ్డి, చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి సహకరించాలి

రోడ్ల విస్తరణలో భాగంగా వనపర్తిలోని పెబ్బేర్ రోడ్డు విస్తరణకు వ్యాపార సముదాయాల యజమానులు సహకరించాలని కలెక్టర్ అభ్యర్థించారు. శుక్రవారం రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన కలెక్టర్ సాయంత్రం ఆర్డీఓ కార్యాలయంలో పెబ్బేర్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు హద్దులను వదిలేసి, నిబంధనలకు అనుగుణంగా తమ స్థలం వరకు షాపులు ఉండాలని, ఏదైతే ఆక్రమణలు చేశారో వాటిని స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ పద్మావతి, మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 4 పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి



ఖిల్లాఘనపురంలోని పరీక్ష కేంద్రంలో నంబర్లు వేస్తున్న అధ్యాపకులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్న గ్రూప్4 పరీక్ష కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాధ తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెంటర్‌లో మొత్తం 240 మందిని పరీక్ష రాయనున్నారని తెలిపారు. అభ్యర్థులకు కావల్సిన తాగునీరు, బెంచీలు తదితర అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మొదటి పేపర్ ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు, రెండో పేపర్ మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ఉంటుందన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని గ్రూప్4 పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అధికారి కతలప్ప తెలిపారు. పట్టణంలోని వీరభద్ర డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, నవభారతి కళాశాల, నారాయణ బీఈడీ కళాశాల, మాస్టర్ మైండ్ స్కూళ్లలో మొత్తం 1,752 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. అలాగే పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రజలు గుంపులుగా తిరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అతిథి గృహాన్ని వినియోగంలోకి తేవాలి



అతిథి గృహాన్ని సందర్శించిన రాజేంద్రప్రసాద్‌యాదవ్

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన అతిథి గృహాన్ని వినియోగంలోకి తేవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి అతిథి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిథి గృహం నిరుపయోగంగా ఉండటం వలన అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని, గతంలో అధికారుల దృష్టికి తీసికెళ్లినా వారు పట్టించుకోవట్లేదని అసహనం వ్యక్తం చేశారు. గృహాన్ని వాడుకలోకి తీసుకొస్తే రంగనాథ ఆలయ దర్శనార్థం వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ విషయంపై వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపించి అతిథి గృహన్ని వినియోగంలోకి తీసురాలని కోరారు. కార్యక్రమంలో మండల రైతు కమిటీ అధ్యక్షుడు పశుల రాముడు, మద్దిలేటి, పురుషోత్తం, గంగాధర్, రమేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం



కొత్తకోటలో రాజీవ్‌గాంధీ క్విజ్ పోటీల గురించి వివరిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

పెబ్బేరు: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని ఎండగడతామని మాజీ మంత్రి చిన్నారెడ్డి అన్నారు. మండలంలోని రంగాపూర్, సూగూర్ గ్రామాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గ్రామ కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిన్నారెడ్డి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందని, కార్యకర్తలు కలికట్టుగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్‌యాదవ్, వెంకటేష్‌సాగర్, రాజ్‌కుమార్, కొండారెడ్డి, కావలి బాలస్వామి, లక్ష్మన్న, వెంకటేష్, ఉపేందర్, నరేష్, దామోదర్ పాల్గొన్నారు.

సోషల్ మీడియా కోఆర్డినేటర్ల ఎన్నిక

కొత్తకోట: మండలంలోని కనిమెట్టలో గుంత రమణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్లను శుక్రవారం ఎన్నుకున్నారు. ముమ్మళ్లపల్లి సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా సుఖేందర్, చర్లపల్లిలో రవీందర్, కనిమెట్టలో పరమేష్‌ను ఎన్నుకున్నారు. అనంతరం మండల ఎన్‌ఎస్‌యూఐ ముస్తఫా ఆధ్వర్యంలో కొత్తకోటలోని వివేకనంద, ప్రతిభ జూనియర్ కళాశాలలను సందర్శించారు. జూలై 2న జరిగే రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాయిలుగౌడ్, గుంత రమణ, శ్రీకాంత్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాఘవరెడ్డి, నవీన్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరల పెంపుపై నిరసన



మాట్లాడుతున్న శ్రీలతారెడ్డి

వీపనగండ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాలతో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయని కాంగ్రెస్ జిల్లా మహిళ అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి దుయ్యబట్టారు. శుక్రవారం మండల కేంద్రంలో పలువురు మహిళలు కాంగ్రెస్ నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. డీజిల్, ఇతర పన్నులను విపరీతంగా పెంచుతూ పోవడంతో సామాన్య ప్రజలు వినియోగిస్తున్న వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని, పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సిలిండర్ ధరలతో పాటు నిత్యావసర ధరలను నియంత్రించేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వందల సుఖన్యారెడ్డి, మండల అధ్యక్షుడు బీరయ్య యాదవ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మీసాల పెద్దరాములు, కిసాన్ సెల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నక్క విష్ణు, రామకృష్ణ, శివమ్మ, ఎల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.